## క్రైం కథ

# అనుమానం



నమ్రత మరీ అందంగా వుంది. అంత అందంగా వున్న ఆమె విశాలమైన కనులలో ఏదో తెలియని భయం, విచారం కదలాడుతున్నాయి. రణధీర్‌కు అదే అంతుపట్టలేదు. ఇంత అందమైన యువతికి వచ్చిన సమస్య యేమిటి? అనుకుని –

''చెప్పండి నమ్రతగారూ... మీరు ఫేస్ చేస్తున్న ప్రాబ్లెమ్ ఏమిటి? మా ఏజెన్సీ నుంచి ఎలాంటి సహాయాన్ని అర్థిస్తున్నారు?'' అని అడిగాడాయన.

''నేను చెప్పే విషయాలను మీరు రహస్యంగా వుంచుతారా?''

''తప్పకుండా... ఇది మా వృత్తిధర్మం... ఎలాంటి సంకోచం లేకుండా మీరు అన్ని విషయాలనూ చెప్పవచ్చు... కేవలం నమ్మకం మీదనే మా సంస్థ పనిచేస్తోంది'' చెప్పాడు రణధీర్.

– రణధీర్ డిటెక్టివ్ ఏజెన్సీ – ఆఫీసులో నమ్రత కూర్చుని వున్నది. సాధారణ అలంకరణతో అసాధారణ అందగత్తెగా అగుపడుతున్న నమ్రతను నిశితంగా పరిశీలిస్తున్న రణధీర్ ఆమె సమస్య ఏమయి వుంటుందాని ఆలోచిస్తున్నాడు.

''నా భర్తపేరు ఏకామ్రేశ్వరరావు. ఆయన హోమ్ నీడ్ ఆర్టికిల్స్ ఎక్స్

పోర్టింగ్ బిజినెస్ చేస్తున్నాడు. ఐదేళ్ళ క్రితం మా పెళ్ళయింది. దాదాపు మూడు నెలల క్రితం వరకు ఆయన నన్ను బాగానే చూసుకున్నాడు. కానీ ఆ తర్వాతనుంచే నన్ను నిర్లక్ష్యం చెయ్యటాన్ని నేను స్పష్టంగా తెలుసుకున్నాను'' అని చెప్పి ఆగింది నమ్రత.

''కారణం ఏదయినా గ్రహించారా?'' రణధీర్ అడిగాడు.

''అవును. ఆయన మరో ఆడదానితో సంబంధం పెట్టుకున్నాడు.''

''ఎలా తెలుసుకున్నారు?''

''ఆయన షర్టు జేబులో దొరికిన చీరలు కొన్న బిల్లులు, ఆడవాళ్ళు పెట్టుకునే నగలు కొన్న రశీదులు.. ఇవేకాకుండా ఒకసారి ఆయన మరో ఆడదానితో కలిసి చాలా సన్నిహితంగా ఓ ఐస్‌క్రీమ్ పార్లర్‌లో నుంచి బయటకు వస్తున్నప్పుడు చూశాను.''

''ఈ విషయం గురించి మీరు ఆయన్ని అడిగారా?''

''అవును. కానీ ఆయన వొప్పుకోలేదు. బుకాయించాడు. ఏవో కథలు చెప్పాడు. కానీ నేను నమ్మలేదు.''

''ఆల్‌రైట్... ఐతే ఈ విషయంలో మానుంచి మీరు కోరుతున్న సాయం ఏమిటో చెప్పండి'' అన్నాడు రణధీర్.

''ఆయనతో తిరుగుతున్న ఆ అమ్మాయి ఎవరు? ఎక్కడ వుంటుంది? పూర్తి వివరాలు కావాలి. ఇంకా వాళ్లిద్దరి మధ్య వున్న సంబంధాన్ని తెలియజేసే రుజువులూ, సాక్ష్యాలూ ఏవైనా సంపాదించగలిగితే మరీ మంచిది. దయచేసి నాకు ఈ సాయాన్ని చేసిపెట్టగలరా?'' అర్థింపుగా అడిగింది నమ్రత.

అప్పుడు రణధీర్ నవ్వి ''తెలుసుకుని ఏం చేస్తారు? విడాకులు తీసుకుంటారా?'' అని అడిగాడు.

''అవును. అదే చేస్తాను.''

ఆ తర్వాత రణధీర్ ఆమె ఇంటి అడ్రసు, ఏకామ్రేశ్వరరావు ఆఫీసు అడ్రసు, ఫోన్ నెంబర్లు తీసుకుని చివరగా నమ్రత ఇచ్చిన ఆమె భర్త ఫొటో తీసుకుని చూసి – ''తెలుగు సినిమాలో హిందీ హీరోలా వున్నాడు. గుడ్...'' అన్నాడు రణధీర్ వాటిని బల్ల సొరుగులో వుంచుతూ.

''అలా వున్నాడనే పెళ్లి చేసుకున్నాను. ఇప్పుడు ఆ అందంతోనే మరో ఆడదాన్ని లోబరుచుకున్నాడు దుర్మార్గుడు'' అన్నది నమ్రత కోపంగా.

ఆ తర్వాత ఫీజు విషయం మాట్లాడి ఎడ్వాన్స్‌గా కొంత డబ్బు ఇచ్చి త్వరలో తను కోరిన వివరాలు అందజేయమని చెప్పి బయటకు వచ్చింది నమ్రత.

***

సముద్రం వొడ్డున ఇసుకలో కూర్చున్నాడు ఏకామ్రేశ్వరరావు. అతనికి దగ్గరగా మనుషులు ఎవరూ లేరు. అతను తన భార్య నమ్రత గురించి ఆలోచిస్తున్నప్పుడు సెల్‌ఫోన్ రింగయ్యింది.

''హలో...'' అన్నాడతను.

''భూపతివర్మను మాట్లాడుతున్నాను. వెంటనే ఒకసారి మా ఆఫీసుకు రాగలరా?'' అని అడిగాడు అవతలివైపు మనిషి.

''ఇప్పుడే వస్తున్నాను'' అని ఏకామ్రేశ్వరరావు లేచి నిలబడి బట్టలకు అంటిన ఇసుకను దులుపుకుని రోడ్డుమీదకు నడిచాడు.

ఏకామ్రేశ్వరరావు పది రోజుల క్రితం ఓ ప్రఖ్యాత ప్రయివేటు డిటెక్టివ్ ఏజెన్సీ ఆఫీసుకు వెళ్లి దాని చీఫ్ భూపతివర్మను కలిసి – తన భార్య నమ్రత ఈమధ్య ఎవరో పరాయి మగవాడితో తిరుగుతోందనీ, అతడి వివరాలు తెలుసుకుని తనకు చెప్పమనీ అడిగాడు.

తను కోరిన వివరాలు తెలుసుకున్నాడనీ, అందుకే తనని వెంటనే వచ్చి కలుసుకోమన్నాడనీ అనుకున్నాడు ఏకామ్రేశ్వరరావు.

ఆయన తన కారులో వెళ్ళేసరికి భూపతివర్మ అతనికోసమే ఎదురూ చూస్తూ ఆఫీసులో వున్నాడు.

''ఎగ్జయిట్ అవకండి రావుగారూ... మీ ఆలోచన నిజమే. ఆమె సూర్యం అనే మనిషితో తిరుగుతోంది. అతనికి శ్రీకన్య థియేటర్ సమీపంలో ఓ ఫోటో స్టూడియో వుంది. దానిపేరు వికల్ప. అతను డాబా గార్డెన్స్‌లో వుంటున్నాడు. అతనికి తెలీకుండా ఓ ఫోటో తీశాను. చూడండి'' అంటూ భూపతి వర్మ ఓ ఫోటోను ఇచ్చాడు.

దాన్ని చూసి ''వీడు నాకంటే అందంగా లేడు'' అన్నాడు ఏకామ్రేశ్వర రావు.

భూపతివర్మ నవ్వి ''అదే మిస్టరీ... కొంతమంది ఆడవాళ్లు మగవాడిలో ఏం చూసి వెంటపడతారో ఎవరికీ అర్థంకాదు. వాళ్లకే తెలియాలి. ఇంతటితో నా పని పూర్తయింది. మళ్లీ ఏదయినా సహాయం అవసరమయితే రండి...'' అన్నాడు.

భూపతివర్మకు మిగిలిన ఫీజు చెల్లించి బయటకు వచ్చాడు ఏకామ్రేశ్వర రావు తన ఆఫీసులో పనిచేసే మస్తాన్‌ని కలుసుకునే ఉద్దేశంతో. మస్తాన్ రెండుసార్లు జైలుకు వెళ్లివచ్చాడు.

**మీ ఆలోచన నిజమే. ఆమె సూర్యం అనే మనిషితో తిరుగుతోంది. అతనికి శ్రీకన్య థియేటర్ సమీపంలో ఓ ఫోటో స్టూడియో వుంది. దానిపేరు వికల్ప. అతను డాబా గార్డెన్స్‌లో వుంటున్నాడు.**

***

వారం రోజుల తర్వాత రణధీర్ – నమ్రత కోరిన వివరాలన్నింటినీ అందజేశాడు.

– ఆమె పేరు చంద్రకళ. ఓ హోటల్‌లో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. అందంగా వుండే మగవాళ్ళంటే బాగా ఇష్టపడుతుంది. పెళ్లయి నాలుగేళ్లయినా పిల్లలు లేరు –

ఈ వివరాలు చెప్పి చంద్రకళ ఇంటి అడ్రసును నమ్రతకు చెప్పాడు రణధీర్.

అప్పుడే ఆమె ఒక నిర్ణయానికి వచ్చింది. ఈ విషయం గురించి తన ఇంట్లో తోటపని చేసే వినాయక్‌ను సంప్రదించాలని అనుకున్నది.

***

ఏకామ్రేశ్వరరావు చెప్పినట్టు చెయ్యటానికి మస్తాన్ వొప్పుకున్నాడు. ముందుగా మస్తాన్‌కు పదిహేను వేల రూపాయలు ఇచ్చాడు ఏకామ్రేశ్వరరావు. సూర్యం అడ్డు తొలగించిన తర్వాత ఇంకొంత డబ్బు ముట్టచెబుతానని అతనికి సూర్యం ఫోటో, అడ్రసూ ఇచ్చాడు.

***

వినాయక్ వయసు నలభై సంవత్సరాలకు దగ్గరగా వుంటుంది. అతను నమ్రత సొంత వూళ్లో వుండేవాడు. నమ్రత అంటే అభిమానం వున్నవాడు. అందువల్లనే సులభంగా అంగీకరించాడు ఆమె చెప్పినట్టు చెయ్యటానికి. నమ్రత కాపురం నిలబడటం కోసం అడ్డుగా వున్న చంద్రకళను ఏదోలా చంపటానికి వొప్పుకున్నాడు. ప్రతిఫలంగా వినాయక్‌కి యాభైవేల రూపాయలు ఇవ్వటానికి సిద్ధపడింది నమ్రత.

***

ఆరోజు దినపత్రికలో 'జంటహత్యలు' అనే శీర్షికతో వచ్చిన వార్తను ఏకామ్రేశ్వరరావు – నమ్రత చదివి ఆశ్చర్యపోయారు. డాబా గార్డెన్స్‌లో వుండే సూర్యనారాయణ, చంద్రకళ దంపతులను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పొడిచి హత్యచేశారనీ, హంతకుల ఆచూకీ సూచనగా కూడా తెలీటం లేదని దినపత్రికలో రాశారు.

సూర్యంను చంపమంటే అతని భార్య చంద్రకళను కూడా మస్తాన్ ఎందుకు హత్యచేశాడో ఏకామ్రేశ్వరరావుకు అర్థం కాలేదు.

చంద్రకళను హత్య చెయ్యమని చెబితే ఆమె భర్త సూర్యనారాయణను కూడా వినాయక్ ఎందుకు హత్య చేశాడో నమ్రతకు తెలీలేదు.

తన భార్య నమ్రతతో తిరుగుతున్న పరాయి మగవాడు సూర్యనారాయణే అని ఏకామ్రేశ్వరరావుకీ, తన భర్త ఏకామ్రేశ్వరరావుతో తిరుగుతున్న పరాయి ఆడది సూర్యనారాయణ భార్య చంద్రకళేనని నమ్రతకీ తెలీదు.

**– ప్రతాప రవిశంకర్**